దుబ్బాక మున్సిపల్‌పై అవిశ్వాస నీడ!

- పావులు కదుపుతున్న కౌన్సిలర్లు
- చైర్‌పర్సన్ భర్తపై తీవ్ర అసంతృప్తి
- స్వచ్ఛంద రాజీనామాకు చైర్‌పర్సన్ ప్రయత్నం
- ఎమ్మెల్యే అనుమతి కోసం ఎదురు చూపులు

7 లో..

హుస్నాబాద్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించండి

- స్థలాన్ని అప్పగిస్తాం.. సానుకూలంగా స్పందించాలి
- టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డికి విన్నవించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

హుస్నాబాద్, జనవరి 16 : హుస్నాబాద్ పట్టణంలో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని కోరారు. మంగళవారం ఆయన తిరుమలలో కుటుంబసమేతంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతిలో కరుణాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆలయానికి సరిపడా స్థలాన్ని అప్పగిస్తామని, తగిన నిధులు కేటాయించాలని కోరారు. రూ.25 కోట్లతో


టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

కలియుగ ప్రత్యక్ష దైవమైన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చేయాలనే సంకల్పం ఉందన్నారు. సానుకూలంగా స్పందించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలపై వేంకటేశ్వర స్వామి కృపాకటాక్షాలు ఎల్లవేలలా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే ఇచ్చిన హామీలు నెరవేర్చేలా స్వామి చల్లని చూపు ఉండాలని కోరుకున్నానన్నారు.

పట్టణంలో మార్నింగ్ వాక్

సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం ఉదయం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హుస్నాబాద్ పట్టణంలోని 4, 5 వార్డుల్లో మార్నింగ్ వాక్ చేశారు. మహిళలు వేస్తున్న ముగ్గులను పరిశీలించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు, ప్రజలతో కలిసి హోటల్‌లో టీ తాగారు. ఆయన వెంట టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్ తదితరులు ఉన్నారు.

కొండపోచమ్మ ఆలయం..
అభివృద్ధికి ఆమడదూరం

- ఆదాయం ఉన్నా మౌలిక సదుపాయాలు కరువు
- ప్రతీ ఏటా భక్తులకు తప్పని ఇబ్బందులు


కొండపోచమ్మ అమ్మవారు

జగదేవ్‌పూర్, జనవరి 16 : కొండపోచమ్మ ఆలయం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ప్రతీ ఏటా సంక్రాంతి నుంచి ఉగాది వరకు మూడు నెలలపాటు ఇక్కడ జాతర కొనసాగుతుంది. కొమురెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈనెల 22 నుంచి మార్చి నెలాఖరు వరకు జాతర కొనసాగనున్నది. జాతరకు సమయం దగ్గరపడినా నేటికి ఏర్పాట్లు అంతంతమాత్రంగానే చేశారు. భక్తులకు సౌకర్యాల కల్పించడంలో నిర్లక్ష్యం నెలకొన్నది. ప్రతీ ఏటా వేలం ద్వారా రూ.50లక్షలు, జాతర సమయంలో మరో రూ.50 లక్షల వరకు ఆదాయం వస్తున్నా అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు.

హామీలకే పరిమితం

గత ప్రభుత్వం ఆలయాభివృద్ధికి రూ.10 కోట్లు ప్రకటించినా ఒక్క రూపాయి విదల్చలేదు. అప్పటి మంత్రి శ్రీనివాస్‌యాదవ్, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి పునరుద్ధరణపై స్థపతితో నమూనాను రూపొందింపజేశారు. అలాగే దేవాదాయశాఖ అధికారులతో, స్థానిక ప్రజాప్రతినిధులతో సమీక్ష కూడా నిర్వహించారు. కానీ అభివృద్ధి పనులకు అడుగు కూడా ముందుకు పడలేదు.

కనీస వసతులు లేవు

జాతరకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతీ ఏటా మహిళా భక్తులు స్నానాలకు, టాయిలెట్లకు కష్టాలు పడుతున్నారు.ఆలయం సమీపంలో మహిళల కోసం ప్రత్యేక తాత్కలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని చెప్పినా మాటలకే పరిమితం చేశారు. తాగునీటి సౌకర్యం సరిగ్గా లేదు. ఆలయం ముందు ఉన్న చెరువును సుందరీకరిస్తామని హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. ఆలయం వద్ద స్థలం లేకపోవడంతో పార్కింగ్ సమస్య జటిలంగా మారింది. రోడ్డుకు ఇరుపక్కలా వాహనాలను నిలుపుతున్నారు. ప్రైవేట్ స్థలాల్లో ఆపితే పార్కింగ్ పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారు. జాతర సమయం సమీపిస్తున్నా ఉత్సవ కమిటీ వేయలేదు. రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వమైన కొండపోచమ్మ ఆలయం అభివృద్ధికి కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం

మూడు నెలల జాతరకు కొండపోచమ్మ ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే పారిశుధ్య పనులు, ఆలయానికి రంగులు వేసే పనులు పూర్తి చేశాం. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కనీస వసతులను కల్పిస్తున్నాం.

- మోహన్‌రెడ్డి, ఆలయ ఈవో


ఆలయ మార్గంలోని రోడ్డుపైనే నిలుపుతున్న వాహనాలు



కొత్తకొండ జాతరకు ప్రదర్శనగా బయల్దేరిన ఎడ్లబండ్లు, పొట్లపల్లిలో అగ్నిగుండంలో ప్రవేశిస్తున్న భక్తులు

సంబరంగా సంక్రాంతి జాతర

బండ మల్లన్నకు బోనాల నివేదన.. పొట్లపల్లి మల్లికార్జున బ్రహ్మోత్సవాల్లో అగ్నిగుండాల ప్రవేశం.. కొత్తకొండకు భక్తుల కానుకల సమర్పణతో సంక్రాంతి జాతర సంబరాలు హోరెత్తాయి. భక్తులు మొక్కులు చెల్లించుకుని గండాలు బాపుమని స్వామివార్లను వేడుకున్నారు. ఈ జాతరల్లో ఎడ్లబండ్ల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బండ మల్లన్న, పొట్లపల్లిలో ఎడ్లబండ్ల ప్రదక్షిణలు నిర్వహించగా కొత్తకొండ వీరభద్ర జాతరకు ఎడ్లబండ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా ప్రారంభించారు.

- హోరెత్తిన ఎడ్లబండ్ల ప్రదర్శనలు
- పొట్లపల్లిలో భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాల ప్రవేశం
- బండ మల్లన్నకు బోనాల సమర్పణ
- వీరభద్రస్వామి జాతరకు సంప్రదాయబద్ధంగా వెళ్లిన భక్తులు

హుస్నాబాద్‌రూరల్, జనవరి 16 : హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామికి సోమవారం సాయంత్రం పొట్లపల్లిలో మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించి, స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండాల ప్రవేశం చేశారు. భక్తులు భారీగా తరలి వచ్చి నిప్పుల మీద నుంచి నడిచి భక్తిని చాటుకున్నారు.

వీరభద్రుని దండకంతో అట్టహాసంగా ప్రదర్శన

అక్కన్నపేట, జనవరి 16: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో నిర్వహించే వీరభద్రస్వామి జాతర ఉత్సవాలకు అక్కన్నపేట మండలం నుంచి ఎడ్లబండ్ల ఊరేగింపు సోమవారం బయలుదేరింది. జనగామ గ్రామానికి చెందిన కొత్త కొండను వీరభద్రస్వామి ప్రతిరూపంగా భావిస్తారు. సూర్యుడు దనస్సు రాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించడానికి ముందు నెలరోజులపాటు ఆయన పవిత్రంగా ఉపవాసం చేస్తారు. 60 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని ఈఏడు పాటించారు. సోమవారం గ్రామస్థులంతా ఆనవాయితీ ప్రకారం ఎడ్ల బండ్లు, ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించుకొని డప్పుచప్పుళ్ల మధ్య వీరభద్రుడి దండకాలు చదువుతూ, ఖడ్గాలను ప్రదర్శించారు. భక్తులు తమ కానుకలను కొత్తకొండకు సమర్పించారు. నోట్ల దండను ఆయన మెడలో వేసి ఆశీర్వాదం తీసుకున్నారు. 50 వరకు ఎడ్లబండ్లను జనగామ గ్రామంలో ఊరేగించిన అనంతరం కొత్తకొండ జాతరకు ర్యాలీగా బయలుదేరారు. భక్తులు సమర్పించిన కానుకలను వారి తరఫున వీరభద్రస్వామికి సమర్పిస్తానని, ఇది తమ పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయమని కొత్తకొండ తెలిపారు.

బండమల్లన్నకు మొక్కుల చెల్లింపు

మిరుదొడ్డి, జనవరి 16 : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి-జంగపల్లి గ్రామాల పరిధిలోని బండ మల్లన్న జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. గుట్ట చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు ఎండ్లబండ్లను అందంగా అలంకరించి బండ్ల బోనాలతో మల్లన్న గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులను చెల్లించుకున్నారు. బోనాలను నివేదించి నైవేద్యాలను సమర్పించారు. భక్తులు బండపై ఉన్న పుట్టు గుండం నీటిని తాగి పంటలపై చల్లుకునేందుకు తీసుకెళ్లారు. బండ మల్లన్న జాతరతో ఆలయ ప్రాంగణం నూతన శోభ సంతరించుకున్నది. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలను చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువతో సన్మానించారు. ఆయన వెంట ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సతీష్‌రెడ్డి, సర్పంచులు వెంకట్‌రెడ్డి, యాదగిరి, ఎంపీటీసీ బాల మల్లేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి తదితరులు ఉన్నారు.



నోట్ల దండలను కొత్తకొండ మెడలో వేస్తున్న భక్తులు, వీరారెడ్డిపల్లిలోని సొరెకల్లో కొలువైన బండ మల్లన్న

తీన్‌రాస్తాలో ప్రమాదాలు..
పీఎస్ పరిధి తెలియక అవస్థలు

- మూడు మండలాల సరిహద్దుల్లో కూడలి
- రాజీవ్‌రహదారిపై ప్రమాదాల ఫిర్యాదుల్లో స్పష్టత కరువు
- పోలీస్‌స్టేషన్ పరిధి తెలియక అయోమయం

బెజ్జంకి, జనవరి 16 : రాజీవ్‌రహదారిని ఆనుకున్న సమీప గ్రామాల్లో బెజ్జంకి మండలంలోని రేగులపల్లి, కోహెడ మండలంలోని శనిగరం, చిన్నకోడూరు మండలంలోని అనంతసాగర్ గ్రామాల సరిహద్దులు ఒకే కూడలిలో కలిసి ఉంటాయి. రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న బెజ్జంకి, కోహెడ, చిన్నకోడూరు మండలాల పరిధిలో ఉన్న గ్రామాలు ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నది తెలియని పరిస్థితి నెలకొన్నది. ప్రమాదాలు జరిగిన సమయంలో ఆ ప్రాంతం ఏ మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందనే విషయం వాహనదారులకు అంతుబట్టడం లేదు. ఘటనా స్థలంలో ప్రత్యక్షసాక్షులు, ప్రజలు ఏ మండల పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలనే విషయంపై తికమక పడుతుంటారు. బెజ్జంకి మండలంలోని రేగులపల్లి గ్రామం బెజ్జంకి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రాగా కోహెడ మండలంలోని శనిగరం కోహెడ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి అనంతసాగర్ పరిధిలోని కొంతభాగం చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది.

పునర్విభజనలో జిల్లాలోకి మండలాలు

బెజ్జంకి, కోహెడ రెండు మండలాలు పూర్వపు కరీంనగర్ జిల్లాలో ఉండగా జిల్లాల విభజన అనంతరం సిద్దిపేట జిల్లాలోకి వచ్చాయి. చిన్నకోడూరు మండలంలోని అనంతసాగర్ సిద్దిపేట జిల్లా పరిధిలోకి యథాస్థానంలో ఉంది. పోలీస్ స్టేషన్‌ల వారీగా ఒకే కూడలి సమీపంలో ఉన్న రేగులపల్లి వద్ద కేసుల విషయంలో అయోమయం నెలకొన్నది. మూడు మండలాల పోలీస్ సిబ్బంది వచ్చి విచారణ చేపట్టిన సందర్భాలు ఉన్నాయి. ఒకేకూడలిలో 15 మీటర్ల పరిధిలోనే మూడు


రాజీవ్ రహదారిపై మూడు మండలాల సరిహద్దుల్లో ఉన్న కూడలి

పోలీస్‌స్టేషన్‌ల హద్దులు ఉండడంతో వాహనదారులు ప్రమాదాలు జరిగినప్పుడు ఫిర్యాదు చేయడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రమాదాలు, ఇతర కేసుల విషయంలో ప్రజలు వెళ్లగా ఫిర్యాదు చేయడానికి ఓ పోలీస్‌స్టేషన్‌కు వెళితే పక్క మండల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని సూచించిన సందర్భాలు ఉన్నాయి.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

సరిహద్దుల కూడల్లో ఉన్న పోలీస్‌స్టేషన్‌ల పరిధిలు ఏమిటో స్పష్టంగా తెలిసేలా సూచికబోర్డులు ఏర్పాట్లు లేవు. దీంతో వాహనదారులు, ప్రజలు మూడు మండలాల పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరుగక తప్పడం లేదు. ఇప్పటికైనా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలు స్పష్టంగా తెలిసేందుకు బోర్డులను ఏర్పాటు చేయాలి. సరిహద్దు ప్రాంతంలో ఎక్కడ ఏ సంఘటన జరిగితే ఏ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలో సంబంధిత అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరముంది.

బోర్డులు ఏర్పాటు చేయాలి



రాజీవ్ రహదారిపై మూడు మండల పరిధిలో ఉన్న ఒకే కూడలి సరిహద్దుల విషయంలో ప్రజలకు, వాహనదారులకు అవగాహన లేదు. సంబంధిత శాఖ అధికారులు ప్రజలకు, వాహనదారులకు తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

- జెల్లా ఐలయ్య, సర్పంచ్

ఫిర్యాదు చేయాలంటే ఇబ్బంది



రాజీవ్‌రహదారిపై ప్రమాదాలు జరిగిన సమయంలో ఏమండల పరిధిలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలో తెలియక పరేషాన్ అవుతాం. స్పష్టత ఇస్తే ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ఆయా పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం ఇచ్చి ప్రాణాలుకాపాడిన వారిమవుతాం.

- శ్రీనివాస్, డ్రైవర్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు

- హెచ్చరికల ఏర్పాటులో నిర్లక్ష్యం
- రోడ్డు విస్తరణ పనులతో అస్తవ్యస్తం

చేర్యాల, జనవరి 16 : జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పలు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు రోడ్డు మధ్యన ప్రమాదకరంగా మారాయి. జాతీయరహదారి నిర్మాణంలో సూర్యాపేట నుంచి 100 ఫీట్ల వెడల్పుతో రోడ్డు పనులను చేపట్టగా చేర్యాల మండలం వీరన్నపేట శివారు నుంచి దుద్దెడ క్రాస్‌రోడ్డు వరకు పనులను ప్రారంభించారు. దారి పొడవునా చేర్యాల పట్టణం, రూరల్ మండలం, కొమురవెల్లి మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో సుమారు 300 విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డు, డ్రైనేజీ కాలువ మధ్యకు చేరాయి. ఇరువైపులా 45 ఫీట్లలోపు డ్రైనేజీ పనులను చేపట్టిన అనంతరం మిగతా ఐదు ఫీట్ల స్థలంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. అందుకు సంబంధించి విద్యుత్‌శాఖ పరంగా లైన్ సవరింపు తదితరాల వ్యయాన్ని రూ.1.30 కోట్లుగా అంచనా వేశారు. ప్రత్యామ్నాయ సేవల నిమిత్తం ప్రతిపాదిత వ్యయంలో పది శాతం డబ్బు విద్యుత్‌శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు కాంట్రాక్టర్ సంబంధిత డబ్బు చెల్లించాడని, ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. కానీ అత్యధిక స్తంభాలు డ్రైనేజీ కాలువ మధ్యన ఉండగా, మరికొన్ని రోడ్డు మధ్యన అత్యంత ప్రమాదకరంగా మారాయి. ప్రమాద హెచ్చరిక సూచన బోర్డులు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చీకటివేళలో ఏమాత్రం ఆదమరిచినా వాహనదారులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉంది. ప్రస్తుతం రోడ్డు పనులు చేర్యాల శివారు వరకు పూర్తి కాగా, డ్రైనేజీ, కల్వర్టుల పనులు నత్తనడకన సాగుతున్నాయి. డ్రైనేజీ పనులు పూర్తి అయితేనే తప్ప విద్యుత్ లేన్, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను సవరించని పరిస్థితి ఉంది. ఆయా పనుల పూర్తికి ఇంకా కొన్నినెలల సమయం పట్టనున్నది. కాగా డ్రైనేజీ, రెయిలింగ్ మధ్యన వచ్చిన విద్యుత్ స్తంభాలను తొలగిస్తే డ్రైనేజీ దెబ్బతినే అవకాశం ఉంది. రోడ్డు విస్తరణలో ఓ పనిపై మరోపని ఆధారపడి ఉన్నందున సంబంధిత శాఖాధికారులు నిర్లక్ష్యం వీడి త్వరితగతిన పనులు పూర్తిచేయించి విద్యుత్ లేన్‌ను సవరించి ప్రమాదాలకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చేర్యాల శ్రీరాంనగర్ కాలనీ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, జూనియర్ కళాశాల ఆవరణలో డ్రైనేజీ మధ్యలో స్తంభం

రోడ్డు నిబంధనలను పాటించాలి

ఉమ్మడి మెదక్ జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ శివలింగయ్య

జహీరాబాద్, జనవరి 16: వాహనదారులందరూ రోడ్డు భద్రత నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఉమ్మడి మెదక్ జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్ శివలింగయ్య పేర్కొన్నారు. జనవరి 15 నుంచి రోడ్డు భద్రత మాసోత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మొగుడంపల్లి మండలంలోని మాడ్గి శివారులో ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనాల డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను నడుపుతున్నవారు అన్ని జాగ్రత్తలను పాటించాలని సూచించారు. కొద్దిపాటి నిర్లక్ష్యం ఫలితంగా కుటుంబాలు రోడ్డుపాలవుతయనే విషయాన్ని గ్రహించాలన్నారు. దేశంలో ప్రతీ మూడు నిమిషాలకో ప్రమాదం జరుగుతున్నదని ఆయన వివరించారు. రోడ్డు నిబంధనలను, సూచనలు పాటిస్తూ వాహనాలను నడపడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్, ఎంవీఐలు డీవీ శ్రీనివాస్‌గౌడ్, నరేంద్రనాయక్ పాల్గొన్నారు.

ఆశల పల్లకిలో అధికారపార్టీ నాయకులు

● నామినేటెడ్ పోస్టుల కోసం పోటాపోటీ

గజ్వేల్, జనవరి 16: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరడంతో నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ నాయకులు ఉవ్విళ్లూరుతున్నారు. నామినేటెడ్ పోస్టులను ఇటీవల ప్రభుత్వం రద్దు చేయడంతో ఒక్కసారిగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆశలు పెంచుకున్నారు.

మార్కెట్ కమిటీలకు తీవ్ర పోటీ

గజ్వేల్, వంటిమామిడి మార్కెట్‌కమిటీల చైర్మన్ పదవులకు అనేక మంది పోటీపడుతున్నారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కితే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు గజ్వేల్, జగదేవ్‌పూర్ మండలాల్లో ప్రొటోకాల్ దక్కుతుందని పలువురు నాయకులు భావిస్తున్నారు. అలాగే వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని భర్తీ చేస్తే వర్గల్, ములుగు, మర్కుక్ మండలాల్లో ప్రొటోకాల్ లభించనున్నది. గజ్వేల్, జగదేవ్‌పూర్ మండలాలకు చెందిన సీనియర్ నాయకులు పోటీపడుతుండగా, గజ్వేల్ మాజీ ఎంపీపీ, గజ్వేల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, జగదేవ్‌పూర్ కోఆపరేటీవ్ సొసైటీ మాజీ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. వంటిమామిడి మార్కెట్‌కు వేలూరు, వర్గల్, నెంటూరు, బైలంపూర్, తునికిబొల్లారం గ్రామాలకు చెందిన సీనియర్ నాయకులు పోటీపడుతున్నారు. ఇక నాచగిరి దేవస్థాన కమిటీకి గజ్వేల్ మండలం బెజుగామ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాదితో పాటు ఉమ్మడి తూప్రాన్‌కు చెందిన పలువురు నాయకులు పోటీపడుతున్నారు. కొండపాక ఏఎంసీ చైర్మన్ పదవికి ఇరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటీపడుతుండగా, జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ ఆలయ కమిటీకి దౌలాపూర్ గ్రామ నాయకుడితో పాటు పలువురు ఆశిస్తున్నారు. ఇక గ్రామస్థాయిలో ఉన్న నాయకులకు ఆయా నామినేటెడ్ పోస్టులలో డైరెక్టర్ పదవులు దక్కేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు వారివారి గాడ్‌ఫాదర్లను కలిసి ఆశీస్సులు పొందుతున్నట్లు తెలుస్తుంది. యువజన కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డిని సిద్దిపేట జిల్లా జడ్పీ చైర్మన్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్‌లలో ఏదో ఒక స్థానానికి పోటీ చేయించాలని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి యోచిస్తున్నట్లు తెలుస్తుంది. కాగా ప్రస్తుతానికి నామినేటెడ్ పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. తెలుస్తుంది.

భూతగాదాల విషయంలో దంపతులపై దాడి



తలకు తీవ్ర గాయంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అయిలయ్య

గజ్వేల్, జనవరి 16: భూతగాదాల విషయంలో అన్నవదినలపై తమ్ముడు, అతని బంధువులు దాడికి పాల్పడిన సంఘటన గజ్వేల్ మండలం జాలిగామ శివార్లలో మంగళవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. గజ్వేల్ మండలం బెజుగామ గ్రామానికి చెందిన చెట్కూరి అయిలయ్యకు నాలుగు ఎకరాల భూమి ఉంది. సదరు భూమి వెనకాలే ఆయన సోదరుడు చెట్కూరి నాగయ్యకు భూమి ఉండడంతో దారి ఇవ్వాలని గొడవపడ్డారు. ఈ విషయమై మంగళవారం ఉదయం నాగయ్య గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు అయిలయ్య అయన భార్య భాగవ్వలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తిరిగి గజ్వేల్ నుంచి ఇంటికి వారి ద్విచక్రవాహనంపై అయిలయ్య-భాగవ్వలు బయలుదేరారు. జాలిగామ శివార్లలోకి చేరుకోగానే చెట్కూరి నాగయ్య, అతడి భార్య లక్ష్మి, రాయపోల్ మండలం ముంగాజుపల్లికి చెందిన పుల్ల మల్లయ్య, అదే గ్రామానికి చెందిన పుల్ల బాబు తదితరులు అయిలయ్య వాహనాన్ని అడ్డగించి, బూతులు తిడుతూ దంపతులపై కర్రలతో దాడి పాల్పడ్డారు. ఈ దాడిలో అయిలయ్య తలకు, భాగవ్వ కాలుకు గాయాలు కాగా దాడికి పాల్పడినవారు అక్కడి నుంచి గజ్వేల్‌కు వెళ్లిపోయారు. దాడి ఘటనను గమనించిన చుట్టుపక్కల వారు 108 వాహనానికి సమాచారం అందించగా బాధితులను గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు గజ్వేల్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై అయిలయ్య కుమారుడు కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ-2 రంగ కృష్ణ తెలిపారు.

పందిల్ల నిత్యాన్నదాన సత్రంలో లేగ దూడకు నామకరణం



లేగ దూడకు నామకరణం చేస్తున్న గోసేవ సత్రం నిర్వాహకులు

హుస్నాబాద్‌రూరల్, జనవరి 16: హుస్నాబాద్ మండలం పందిల్లలో సిద్దిరామేశ్వర నిత్యాన్నదాన సత్రంలో జన్మించిన లేగదూడకు నామకరణోత్సవం చేశారు. సత్రంలో ప్రత్యేక తొట్టి(ఊయల) ఏర్పాటు చేసి తొట్టిలో లేగదూడను వేసి నందీశ్వరునిగా నామకరణం చేశారు. తిరుమల, తిరుపతి దేవస్థానం పాలక వర్గం మాజీసభ్యులు మురంశెట్టి రాములు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. లేగదూడకు నందీశ్వరుడిగా నామకరణం చేశారు.

సదాశివపేట బల్దియాలో అవిశ్వాసం?

● పావులు కదుపుతున్న బీఆర్‌ఎస్ చీలికవర్గం ● మద్దతిస్తున్న ఓ కౌన్సిలర్ భర్త



సదాశివపేట మున్సిపల్ కార్యాలయం

సదాశివపేట, జనవరి 16: సంగారెడ్డి జిల్లా సదాశివపేట బల్దియా చైర్‌పర్సన్‌పై బీఆర్‌ఎస్ అసంతృప్తి కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు పావులు కదుపుతున్నట్టు సమాచారం. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బీఆర్‌ఎస్ పాలకవర్గాన్ని గద్దె దింపే ఆలోచనలో కాంగ్రెస్ నాయకులు సైతం తెర వెనుక అండగా నిలుస్తున్నారని ప్రచారం. నేడో, రేపో కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసులు ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు నిర్ణయించుకున్నట్టు చర్చ సాగుతున్నది. కౌన్సిలర్‌గా కొనసాగుతున్న చైర్‌పర్సన్ కుమారుడి తీరుపై విసుగెత్తి ఎట్టిపరిస్థితుల్లో అవిశ్వాసం పెట్టి తీరాలని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు భావిస్తున్నారు. వారికి చైర్‌పర్సన్ పదవిపై ఆశతో ఇటీవల బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఓ కౌన్సిలర్ భర్త మద్దతు తెలుపుతున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 'బల్దియా'పై కాంగ్రెస్ జెండా ఎగరేయాలనే లక్ష్యంతో అధికార పార్టీ ముందుకు వెళ్తున్నది. ఇటీవల బీజేపీ నుంచి బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్న ఓ కౌన్సిలర్ భర్త తన భార్యను బల్దియా పీఠంపై కూర్చోబెట్టాలనే కృతనిశ్చయంతో అసంతృప్త కౌన్సిలర్లతో పలుమార్లు మంతనాలు జరిపి నయానో భయానో తనవైపు తిప్పుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఆర్థికంగా చక్కదిద్దుకోవాలనుకుంటున్న కొందరు కౌన్సిలర్లు కూడా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చూస్తున్నట్టు సమాచారం.

దుబ్బాక మున్సిపల్‌పై అవిశ్వాస నీడ!

● పావులు కదుపుతున్న కౌన్సిలర్లు
● చైర్‌పర్సన్ భర్తపై తీవ్ర అసంతృప్తి
● స్వచ్ఛంద రాజీనామాకు చైర్‌పర్సన్ ప్రయత్నం
● ఎమ్మెల్యే అనుమతి కోసం ఎదురు చూపులు



దుబ్బాక, జనవరి 16: సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నీడలు కమ్ముకుంటున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూమిరెడ్డిని స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకోవాలని కౌన్సిలర్‌లంతా ఒత్తిడి తెస్తున్నారు. ఆమె భర్త భూమిరెడ్డి వ్యవహారశైలి తమకు నచ్చడంలేదని సుమారు రెండున్నరేళ్ల నుంచి కౌన్సిలర్లు గ్రూపులుగా విడిపోయారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కౌన్సిలర్లను సముదాయించుకుంటూ వస్తున్నారు. అయినా కూడా భూమిరెడ్డి వ్యవహార శైలి మారకపోవడంతో మంగళవారం సుమారు 15మంది కౌన్సిలర్లు సమావేశం ఏర్పాటు చేసి, తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. తాము అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టకముందే పదవి నుంచి తప్పుకోవడం ఉత్తమమని చైర్‌పర్సన్‌పై ఒత్తిడి తెస్తున్నారు. తమ అసమ్మతిని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కౌన్సిలర్లతో బుధవారం సమావేశం కానున్నారు. ఆ తర్వాత తమ నిర్ణయం ప్రకటించనున్నట్లు అసమ్మతి కౌన్సిలర్లు తీర్మానం చేసుకున్నట్లు తెలిసింది. మున్సిపల్ వ్యవహారం ఎమ్మెల్యే చేతిలో పెట్టాలని, ఆయనదే తుది నిర్ణయమని వారంటున్నారు.

క్రిమి సంహారక మందు చల్లడంతో

ఉల్లి తిమ్మాయిపల్లిలో మృతి చెందిన చేపలు

● సుమారు రూ.రెండున్నర లక్షల వరకు నష్టం



చనిపోయిన చేపలు, చెరువు వద్ద దొరికిన మందు డబ్బా

చేగుంట, జనవరి 16: మెదక్ జిల్లా చేగుంట మండలం ఉల్లి తిమ్మాయిపల్లి గ్రామంలోని వడ్లోనికుంట చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు క్రిమి సంహారక మందు చల్లడంతో చేపలు చనిపోయాయి. ఈ సంఘటన సోమవారం ఉదయం జరిగింది. గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యుడు తలారి సత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని వడ్లోనికుంట చెరువులో 50వేల చేపపిల్లలు వేయగా.. అవి పెద్దవై అమ్మకానికి వచ్చాయి. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో క్రిమి సంహారక మందు చల్లడంతో చేపలన్నీ చనిపోయి, సుమారు రెండున్నర లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లింది. ఈ విషయమై మెదక్ మత్స్య శాఖ అధికారులతో పాటు చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మత్స్య శాఖ అధికారులు, చేగుంట పోలీసులు చెరువును పరిశీలించారు. చెరువు వద్ద దొరికిన క్రిమిసంహారక మందుడబ్బాను అధికారులు, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కానుకుంటలో ఇరు వర్గాల ఘర్షణ

● ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు ● డీఎస్పీ విచారణ

గుమ్మడిదల జనవరి 16: ఈ నెల 13న కానుకుంట గ్రామంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. ఏడుగురిపై గ్రామానికి చెందిన గుండగల విజయ్ ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదయింది. నిజ నిర్ధారణ మేరకు మంగళవారం కానుకుంట గ్రామంలో పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి నేతృత్వంలో పూర్తిస్థాయి విచారణ జరిపినట్టు జిన్నారం సీఐ వేణుకుమార్ తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి.. మృతదేహమై లభ్యం



షేక్ సిద్ధిక్(ఫైల్)

రామాయంపేట, జనవరి 16: మూడురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి మంగళవారం మృతదేహమై కనిపించాడు. రామాయంపేట పట్టణంలోని దుర్గమ్మ బస్తీలో నివసిస్తున్న షేక్ సిద్ధిక్(52) ఆదివారం తన ఫోన్‌ను ఇంట్లోనే ఉంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకూ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. మంగళవారం సాయంత్రం సిద్దిపేట రహదారిలోని మల్లె చెరువులో షేక్ సిద్ధిక్ మృతదేహాన్ని గుర్తించారు. సమాచారాన్ని తెలుసుకున్న ఎస్‌ఐ రంజిత్ మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు రామాయంపేట ఎస్‌ఐ రంజిత్ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

అక్కన్నపేట, జనవరి 16: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, గీత కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపల్లి గ్రామానికి చెందిన బబ్బురు సదానందంగౌడ్ మంగళవారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్ వాహనం ద్వారా హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. తీవ్రంగా గాయపడిన గీత కార్మికుడికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయాలని పలువురు కోరారు.

పోలీసుల విధులకు ఆటంకం

● నలుగురి రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న సీఐ రాజు

జహీరాబాద్, జనవరి 16: జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్‌లో సోమవారం పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన గౌస్‌షా, కాలపల్లి యోసెఫ్, సూర్యాపేట ప్రవీణ్, చాకలి శ్రీనివాస్‌లను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ రాజు, పట్టణ ఎస్‌ఐ-2 శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 14న రాత్రి 10 గంటల సమయంలో పస్తాపూర్‌లో గొడవ జరుగుతున్నదని 100 నంబర్‌కు కాల్ రావడంతో పోలీసు సిబ్బంది తిరుపతి, శ్రీనివాస్, అశోక్ గ్రామానికి వెళ్లారు. గొడవ చేస్తున్నవారిని వారించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో గౌస్‌షా, కాలపల్లి యోసెఫ్, సూర్యపేట ప్రవీణ్, చాకలి శ్రీనివాస్ వినకుండా పోలీసులపై దాడిచేసి, విధులకు ఆటంకం కలిగించారు. గాయాలకు గురైన కానిస్టేబుల్ శ్రీనివాస్ ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి 14 రోజుల పాటు రిమాండ్ విధించారని సీఐ, ఎస్‌ఐ వెల్లడించారు.

రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన



సంగారెడ్డి మండలం ఫసల్‌వాది చౌరస్తా వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీఏ అధికారులు

సంగారెడ్డి రూరల్, జనవరి 16: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారులోని ఎంఎన్‌ఆర్ చౌరస్తా వద్ద మంగళవారం ఆటో డ్రైవర్లకు ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించకూడదని, వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని, వాహనం నడిపే సమయంలో ఫోన్ మాట్లాడకూడదని సూచించారు. వీటివల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు

హవేళిఘణపూర్, జనవరి 16: కోతుల దాడిలో ఇద్దరికి గాయాలైన సంఘటన హవేళిఘణపూర్‌లో జరిగింది. ఆదివారం రాత్రి హవేళిఘణపూర్ గ్రామానికి చెందిన వడ్ల ఫణిరాజు ఇంటిని చుట్టుముట్టిన కోతుల మూకను వెళ్లగొడుతుండగా.. అవి వెంటపడి చేతిని కరిచాయి. వెంటనే మెదక్ జిల్లా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. అదే గ్రామానికి చెందిన వడ్ల నాగరాజు కూడా కోతులను తరుముతుండగా వెంటపడ్డాయి. పరుగులు తీస్తున్న నాగరాజు కిందపడడంతో కాలు విరిగింది.

ఈతవనంలో చెలరేగిన మంటలు

● 3,000ల చెట్లు బుగ్గిపాలు, రూ.4 లక్షల ఆస్తి నష్టం
● ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎక్సైజ్ సీఐ
● రామాయంపేట శివారులో ప్రమాదం



రామాయంపేటలో మంటల్లో ఈతవనం

రామాయంపేట, జనవరి 16: మెదక్ జిల్లా రామాయంపేట పట్టణ శివారులోని ఈతవనంలో సోమవారం మంటలు చెలరేగి, సుమారు 3,000ల ఈత చెట్లు బుగ్గిపాలయ్యాయి. రూ.4లక్షల మేర నష్టం వాటిల్లింది. దీంతో స్థానిక గీత కార్మికులు ఉపాధిని కోల్పోవాల్సి వచ్చింది.

సోమవారం సాయంత్రం ఇక్కడ అటవీ ప్రాంతంలో అకస్మాత్తుగా చెలరేగిన మంటలు ఈతవనాన్ని చుట్టుముట్టాయి. విషయం తెలుసుకున్న స్థానిక గీత కార్మికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే పదివేల చెట్లు ఉన్న వనంలో మూడువేల దాకా కాలి బూడిదయ్యాయి. రామాయంపేట గీత పారిశ్రామిక సహకార సంఘం వారు దశాబ్దంన్నర క్రితం అయిదెకరాల స్థలంలో పదివేల ఈత మొక్కలు నాటగా నేడు అవి పెరిగి పెద్దవై ప్రతి నిత్యం 400 నుంచి 500 లీటర్ల వరకు కల్లును అందిస్తున్నాయి. ఈ క్రమంలో జరిగిన అగ్ని ప్రమాదంతో ప్రస్తుతం కల్లును అందించే చెట్లు కాలిపోవడంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న గీత కార్మికులు ఆదాయాన్ని కోల్పోయారు. కార్మికుల ఉపాధికి గండి పడినట్లయింది. అయితే, పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలో చెలరేగిన ఈ మంటలు ఈతవనంలోకి చొచ్చుకు వచ్చాయని సహకార సంఘం అధ్యక్షుడు పల్లె శ్రీనివాసగౌడ్ స్థానిక ఎక్సైజ్ సీఐ జయసుధకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం సీఐ తమ సిబ్బందితో ఈతవనాన్ని పరిశీలించి, పంచనామా చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



లక్ష్మి(ఫైల్)

కొండపాక, జనవరి 16: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా కొండపాకలో సోమవారం రాత్రి జరిగింది. కొండపాక గ్రామానికి చెందిన కాశబోయిన లక్ష్మి(60)కి సోమవారం రాత్రి ఇంట్లో నీళ్ల వేడి చేయడం కోసం పెట్టిన వాటర్ హీటర్ తగలడంతో షాక్‌కు గురైంది. తీవ్ర గాయాలు కావడంతో సిద్దిపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య



చంద్రకళ(ఫైల్)

హవేళిఘణపూర్, జనవరి 16: జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన హవేళిఘణపూర్ మండలం ఔరంగాబాద్‌లో సోమవారం రాత్రి జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఔరంగాబాద్ గ్రామానికి చెందిన ఎర్రి చంద్రకళ(48) అనారోగ్యంతో బాధపడుతూ ఉండేది. సోమవారం రాత్రి కుటుంబీకులతో కలిసి భోజనం చేసి పడుకున్నది. రాత్రి ఆమె కుమారుడు విజయ్ మూత్ర విసర్జనకు లేచి చూడగా చంద్రకళ కనిపించలేదు. ఆరుబయట వెతకగా పక్కనే ఉన్న చెట్టుకు చీరతో ఉరేసుకుని విగతజీవిగా కనిపించింది. విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. మృతురాలికి భర్త, కొడుకు, కోడలు ఉన్నారు.

కారు బోల్తా పడి ఒకరి మృతి



మృతి చెందిన కమలమ్మ

అక్కన్నపేట, జనవరి 16: అతివేగం, అజాగ్రత్తగా వెళ్తున్న కారు బోల్తా పడి కల్వర్టులోకి దూసుకెళ్లడంతో ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన గర్నెపూడి అబేదజ్గో ఆయన భార్య రేవతి, అత్త గుజ్జర్లపూడి కమలమ్మ(84) కారులో గుంటూరు నుంచి కరీంనగర్‌కు వెళ్తున్నారు. అక్కన్నపేట శివారుకు చేరుకోగా అతివేగం, అజాగ్రత్తతో నడుపుతున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న కమలమ్మ అక్కడికక్కడే మృతిచెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ వాహనంలో హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి బంధువు రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపారు.

తక్కువ రోజుల్లో ఎక్కువ డబ్బులు ఇస్తామంటూ మోసం

● శామీర్‌పేట్ నిధి లిమిటెడ్ పేరుతో సంస్థ ఏర్పాటు
● నమ్మి డబ్బు కట్టి, మోసపోయిన ఎల్కల్ గ్రామవాసులు
● భార్యాభర్తలను అరెస్టు చేసిన బేగంపేట పోలీసులు

రాయపోల్, జనవరి 16: ఫైనాన్స్ పేరుతో తక్కువ రోజుల్లో ఎక్కువ డబ్బులు ఇస్తామని ప్రజలను మోసం చేస్తున్న భార్యాభర్తలను అరెస్టు చేసినట్లు సిద్దిపేట జిల్లా బేగంపేట ఎస్‌ఐ అరుణ్ తెలిపారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం కొల్తూర్ గ్రామానికి చెందిన భాగవతం శివశంకర్, భాగవతం శశికళ భార్యాభర్తలు. ప్రభుత్వ అనుమతి, లైసెన్స్ లేకుండా 2022 జనవరిలో శామీర్‌పేట్ నిధి లిమిటెడ్ పేరుతో ఓ కంపెనీని ఏర్పాటు చేశారు. గజ్వేల్, సిద్దిపేట, ముత్తంగి, కందుకూరు, దేవరకొండ, నల్గొండ ప్రాంతాల్లో దాని ద్వారా చిట్ నడిపిస్తామని, రుణాలు ఇప్పిస్తామని చెబుతూ రెండు స్కీములను ప్రవేశపెట్టారు. అందులో భాగంగా వారి వద్ద ఎవరైనా కొంత డబ్బు కడితే 45రోజుల తర్వాత కట్టిన దానికి పది రెట్లు అధికంగా ఇస్తామని, నేరుగా బ్యాంకు ఖాతాలో జమచేస్తామని చెక్కులు ఇచ్చేవారు. ఈ క్రమంలో బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్కల్ గ్రామానికి చెందిన పిట్ల కృష్ణ, ఇంటేనుక నరసవ్వ, పిట్ల చిన్న వెంకటయ్య, మర్కంటి రాజు, దోనేపల్లి లింగంల వద్ద మొత్తం రూ.2లక్షల 60వేలు తీసుకుని అందుకు పది రెట్లు 45రోజుల తర్వాత ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో బేగంపేట ఎస్‌ఐ అరుణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శివశంకర్, శశికళ ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసి వారి నుంచి శామీర్‌పేట్ నిధి లిమిటెడ్‌కు సంబంధించిన రికార్డులను, బాండ్‌లను, స్టాంప్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండుకు పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ అరుణ్ మాట్లాడుతూ.. ఫైనాన్స్ ఇస్తామని, డబ్బులు రెట్టింపు చేస్తామని, రకరకాల మోసాలతో గ్రామాల్లో తిరిగే వ్యక్తులను నమ్మవద్దని, వారికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు.

ఇస్లాంపూర్ రామప్పగుట్టపై బండ్ల ఊరేగింపు



తూప్రాన్ మండల రామప్పగుట్టపై ఎడ్లబండ్ల ఊరేగింపు



సంగారెడ్డి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నోములు నిర్వహిస్తున్న దృశ్యం

తూప్రాన్, జనవరి 16: మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ శివారులోని రామప్పగుట్టపై వెలసిన స్వయంభు భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం జాతర నిర్వహించారు. ఆలయ పూజారి శలాక ఆత్రేయశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బండ్లు, బోనాల ఊరేగింపుతో పాటు సాయంత్రం జాతర నిర్వహించారు. ఉత్సవాలకు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై, స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం గోపాల కాలువలు, స్వామి సేవా ఊరేగింపు నిర్వహించారు. బుధవారం హోమం, రథోత్సవం నిర్వహించనున్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో పంచ కల్యాణ మహోత్సవం

సంగారెడ్డి రూరల్, జనవరి 16 : సంగారెడ్డి పట్టణ శివారులోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం ఆర్యవైశ్య మహిళా సంఘం, వాసవీ మహా సంస్థాన్ ఆధ్వర్యంలో పంచకల్యాణ నోముల మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తోపాజి అనంతకిషన్, ఉపాధ్యక్షుడు రాధాకిషన్, మహిళా సంఘం అధ్యక్షురాలు మాలతి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి మల్లేశం, సభ్యులు విద్యాసాగర్, బుచ్చిలింగం, శివకుమార్, కృష్ణవేణి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

● అల్లుడే కారణమంటూ మృతురాలి తండ్రి ఫిర్యాదు



సుధారాణి(ఫైల్)

రాయపోల్ జనవరి 16: మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం చిన్న మాసాన్‌పల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మృతురాలి తండ్రి, ఎస్‌ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్ద ఆరేపల్లి గ్రామానికి చెందిన గొడుగు సుధారాణి(30)ని చిన్న మాసానిపల్లి గ్రామానికి చెందిన గొడుగు నర్సింహులుకిచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. సోమవారం చిన్నఆరేపల్లిలో జరిగిన బంధువు దశదినకర్మకు వెళ్లిన సుధారాణి సాయంత్రం తన కొడుకుతో కలిసి పెద్దఆరెపల్లిలోని తల్లి గారి ఇంటికి వెళ్లింది. కొంతసేపటి తర్వాత భర్త నర్సింహులు పెద్దఆరెపల్లికి వచ్చి భార్యను తిడుతూ ఇంటికి రావాలని ఒత్తిడి చేసి, భార్య, కొడుకును తీసుకొని చిన్న మాసాన్‌పల్లికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి సమయంలో సుధారాణి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నదని ఆమె తండ్రికి ఫోన్ రావడంతో ఆయన హుటాహుటిన అక్కడికి వెళ్లాడు. సుధారాణి మృతిపై ఆమె భర్తపైన అనుమానం ఉన్నదని మృతురాలి తండ్రి ఆరిగె యాదయ్య రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



హరికిషన్ (ఫైల్)

రాయపోల్, జనవరి 16: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు, బేగంపేట ఎస్‌ఐ అరుణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కల్‌కు చెందిన బర్కం హరికిషన్(27) ఇటీవల అప్పు చేసి ఇల్లు కట్టాడు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పు తీర్చడం ఇబ్బందిగా మారిందని తరచూ భార్యతో చెప్పుకుంటూ బాధపడుతుండే వాడు. ఈ క్రమంలో ఈ నెల 14న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆయన కోసం వెతకగా పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. ఈ మేరకు మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అరుణ్ తెలిపారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని యువకుడి మృతి

హవేళిఘణపూర్, జనవరి 16: వాటర్ ట్యాంకర్ ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన రామాయంపేట మండలం లక్ష్మాపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన వడ్ల మహేష్(23) సోమవారం ద్విచక్ర వాహనంపై మెదక్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఔరంగాబాద్ గ్రామ శివారులోకి చేరుకోగా అక్కడ వాటర్ ట్యాంకర్‌ను డ్రైవర్ రివర్స్ తీస్తున్నాడు. ఇది గమనించకుండా ద్విచక్రవాహనాన్ని పోనివ్వడంతో ట్యాంకర్‌కు తగిలి తలకు తీవ్రగాయాలై మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

హవేళిఘణపూర్, జనవరి 16: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని ఔరంగాబాద్‌తండాకు చెందిన నేనావత్ లక్ష్య(48) ఆర్టిజన్ ఉద్యోగిగా మెదక్ పట్టణంలో పనిచేస్తున్నాడు. సోమవారం తన వాహనంపై హవేళిఘణపూర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా స్కూల్‌తండా శివారులోని మూలమలుపు వద్ద కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో మెదక్ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి కొడుకు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

పాత పంటల జాతర

● డీడీఎస్ ఆధ్వర్యంలో సిద్ధాపూర్‌లో తృణధాన్యాల సాగు, చిరుధాన్యాల ప్రాముఖ్యతపై గిరిజన ప్రజలకు అవగాహన

కోహీర్, జనవరి 16: సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని సిద్ధాపూర్ తండాలో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) సభ్యులు మంగళవారం చిరుధాన్యాల విశిష్టతను వివరిస్తూ పాత పంటల జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సుశీలాబాయి ఎడ్లబండ్లకు పూజ చేసి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీఎస్ సంఘం మహిళలు పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ విత్తనాలతో అలంకరించిన ఎడ్ల బండ్ల ఊరేగింపులో గిరిజన ప్రజలకు చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే పాత పంటల అవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు డీడీఎస్ మహిళా సభ్యులు మాట్లాడుతూ.. గిరిజన తండాల్లో కూడా చిరుధాన్యాల సాగు చేపట్టాలని కాంక్షించారు. పూర్వం గ్రామాల్లో రైతులు చిరుధాన్యాల పంటలైన సజ్జలు, కొర్రలు, సామలు, జొన్నలు, మినుములు, పెసర పండించే వారని గుర్తు చేశారు. ప్రస్తుత రోజుల్లో రసాయన మందులు పిచికారి చేయడం వల్ల పూర్తిస్థాయిలో ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార పంటలు లభించడం లేదని పేర్కొన్నారు. దీంతో అనారోగ్యాలకు గురవుతున్నారని అభిప్రాయపడ్డారు. పూర్వపు రోజుల మాదిరిగా మళ్లీ చిరుధాన్యాల సాగును పెంపొందిస్తే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని తెలిపారు. తృణధాన్యాల పంటల సాగుకై కృషి చేస్తున్న డీడీఎస్ వారిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భేమ్‌సింఘ్, డీడీఎస్ సిబ్బంది సుక్కమ్మ, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలతో అలంకరించిన ఎడ్ల బండ్ల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



తృణధాన్యాల ప్రాముఖ్యతను వివరిస్తున్న డీడీఎస్ సభ్యులు

మల్లన్న ఆలయంలో ఒగ్గు పూజారిపై చర్యలు

● వారంరోజుల పాటు విధుల నుంచి తొలగింపు

చేర్యాల, జనవరి 16: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ఓ భక్తుడి నుంచి అధికంగా డబ్బులు డిమాండ్ చేసి దురుసుగా ప్రవర్తించిన ఒగ్గుపూజారి జినుకల బుచ్చయ్యపై చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో బాలాజీశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌కు చెందిన కట్ల జనార్దన్‌రెడ్డి రెండురోజుల క్రితం మల్లన్న దర్శనార్థంవచ్చి టికెట్ తీసుకుని గంగిరేగుచెట్టు ప్రాంగణంలో పట్నం వేసిన క్రమంలో కట్నం పేరిట అడిగినంత డబ్బులు ఇవ్వనందున ఒగ్గుపూజారి జింకల బుచ్చయ్య పట్నంవస్త్రాన్ని చెత్త బుట్టలో వేశాడని ఆలయాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఇందుకు స్పందించిన ఆలయ ఈవో బాలాజీశర్మ ఒగ్గుపూజారి జినుకల బుచ్చయ్య తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలతో పాటు ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించినందుకు వారం రోజుల పాటు విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. భక్తులను ఇబ్బందులకు గురిచేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు హిషాంత్



గజ్వేల్‌టౌన్, జనవరి 16: 67వ జాతీయస్థాయి పాఠశాలలో క్రికెట్ పోటీలకు బాకి హిషాంత్ ఎంపికైనట్లు సిద్దిపేట జిల్లా కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. గజ్వేల్‌కు చెందిన హిషాంత్ గత నెల డిసెంబర్ గద్వాల్‌లో జరిగిన అండర్ 17 పోటీల్లో ఐదు మ్యాచ్‌లలో 10 వికెట్లుతీసి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాడు. ఈ నెల 16 నుంచి 23వరకు బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో హిషాంత్ పాల్గొననున్నట్లు తెలిపారు.

అంబరాన్నంటిన పండుగ సంబురాలు



చిన్నకోడూరులో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న యువతి, మట్టి గురిగిలో పాలు పొంగిస్తున్న దృశ్యం



చేర్యాలలో ఓ ఇంట్లో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు



వర్గల్‌లో చిన్నారికి బోడపండ్ల వైభోగం

జిల్లావ్యాప్తంగా సోమవారం సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉండేవారు పండుగ సందర్భంగా సొంత ఊళ్లకు చేరుకోవడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొన్నది. వాకిళ్ల ముందు సంక్రాంతి ముగ్గులతో వీధులన్నీ కళకళలాడాయి. మహిళలు బొమ్మల కొలువులు పెట్టి, నోములు నోచుకున్నారు. యువత, చిన్నారులు, పెద్దలు గాలిపటాలను ఎగురవేస్తూ కేరింతల మధ్య పండుగను ఘనంగా జరుపుకున్నారు.

చిన్నకోడూరు, జనవరి 16: మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, యువతులు ఉదయాన్నే లేచి వాకిళ్లలో కల్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులు వేశారు. ఆవు పేడతో గొబ్బెమ్మలు తయారు చేసి, పువ్వులతో అలంకరించి వాటిని ముగ్గుల మధ్యలో ఉంచారు. గొబ్బెమ్మల వద్ద నవధాన్యాలు, రేగు పండ్లు పెట్టి పూజలు చేశారు. ఇళ్లలో మట్టి తయారు చేసిన గురుగులలో పాలను పొంగించారు. పలు రకాల పిండి వంటలను బంధుమిత్రులతో కలిసి ఆరగించారు. చిన్నారులు, యువకులు, పెద్దలు గాలిపటాలు ఎగుర వేసి ఉత్సాహంగా గడిపారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో సోమవారం సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇంటి ముందు కల్లాపి చల్లి వివిధ రంగులు, విభిన్న రంగవల్లులతో వాకిళ్లను అందంగా తీర్చిదిద్దారు.

● **చేర్యాల:** సంక్రాంతి, కనుమ పర్వదిన వేడుకలను సోమ, మంగళ వారాల్లో చేర్యాల, కొమురవెల్లి మండలాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, యువతులు తమ ఇళ్ల ముంగిళ్లలో రంగు రంగుల ముగ్గులు వేశారు. మహిళలు తమ కుటుంబాలకు సకల శుభాలు కలగాలని కోరుకుంటూ పరస్వరం నోములు నోచుకున్నారు. జగదేవ్‌పూర్ మండల ఆస్పత్రివైద్యురాలు సీహెచ్. దీపాంజలి నివాసంలో బొమ్మల కొలువు ఏర్పాటుచేశారు. పలు గ్రామాల్లో కబడ్డీ, షటిల్, క్రికెట్ క్రీడాపోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు.

● **వర్గల్:** మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి సందర్భంగా ఇంటి వాకిట్లోల ముగ్గులు, గొబ్బెమ్మలు పెట్టారు. గడప బయట పిడకలను ఏర్పాటు చేసి పాలు పొంగించారు. చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా పతంగులు ఎగరవేశారు.

● **బెజ్జంకి:** మండల వ్యాప్తంగా గ్రామాల్లో సంక్రాంతి పండుగ పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. సంక్రాంతి సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అయోధ్య రాముడి జెండాల పంపిణీ



జెండాలను పంపిణీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

కొండపాక, జనవరి 16: కుకునూరుపల్లి గ్రామంలో ఇంటింటికీ అయోధ్య రాముడి జెండాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఇంటింటికీ కాషాయ జెండా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఇంటి పై జెండా కట్టుకోవాలని తెలిపారు. వాసవీక్లబ్ కొండపాక అధ్యక్షుడు ఉప్పల రాజు, ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కాచం నవీన్ కుమార్, ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వహిందూ పరిషత్ సభ్యులు కొమరవెల్లి సంతోష్, కాపర్తి రాజు, కొడితల సంతోష్, నాగరాజు పాల్గొన్నారు.

పండగ పూట తాగునీటి తిప్పలు

● ట్యాంకర్ల ద్వారా సమస్య తీర్చిన సర్పంచ్



ఇంటింటికీ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్న దృశ్యం

కొండపాక, జనవరి 16 : పండుగ పూట మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో పైప్‌లైన్ సరిగా లేక పోవడంతో పాటు, ఇతర కారణాలతో తరచూ నీటి సరఫరాలో అంతరాయం కలుగుతున్నది. సంక్రాంతి పండుగ రోజు సోమవారం నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అయితే గ్రామ సర్పంచ్ కందూరి కనకవ్వ ఐలయ్య వెంటనే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసి సమస్యను తీర్చారు.



ప్రమాదానికి గురైన బస్సు

రాజీవ్ రహదారిపై బస్సును ఢీకొన్న లారీ

బెజ్జంకి, జనవరి 16: లారీ అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొన్న సంఘటన మండలంలోని తోటపల్లి శివారులోని రాజీవ్ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు కరీంనగర్ నుంచి సుమారుగా ముప్పై తొమ్మిది మంది ప్రయాణికులతో బెజ్జంకి బయలుదేరింది. ఈ క్రమంలో తోటపల్లి శివారు రాజీవ్ రహదారిపై కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను దాటి ఆర్టీసీ బస్సును వెనుక భాగంలో ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఓ బస్సు ప్రయాణికుడితో పాటు లారీ డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. లారీ డ్రైవర్ మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతున్నట్లు స్థానికులు తెలిపారు. కాగా ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. బస్సు డ్రైవర్ సంపత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ శంకర్ రావు తెలిపారు.

రేపు గజ్వేల్‌లో బీఆర్‌ఎస్ కృతజ్ఞత సభ

గజ్వేల్, జనవరి 16: ఈ నెల 18న గజ్వేల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కృతజ్ఞత సభను నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బెండే మధు తెలిపారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ భారీ మెజార్టీతో గజ్వేల్‌లో మూడోసారి గెలిచిన సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని శోభా గార్డెన్స్‌లో గురువారం ఉదయం 10గంటలకు కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

పరిశ్రమలో చోరీ... 9 మంది అరెస్టు

మనోహరాబాద్, జనవరి 16: మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులోని ఎంపీఎల్ స్టీల్ పరిశ్రమలో దొంగతానికి పాల్పడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఎంపీఎల్ పరిశ్రమలో లోడింగ్ సూపర్‌వైజర్లు విజయ్, దుర్గాప్రసాద్, ప్రభాత్‌కుమార్, చరణ్ లోడింగ్ చేసే సమయంలో దొంగతనంగా 33 టన్నుల స్టీల్‌ను ముసలికుమార్, మహ్మద్ హుస్సేన్‌కు అమ్మారు. పరిశ్రమ యజమాని వినోద్ కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కేసు నమోదు చేసి 9 మందిని మంగళవారం కోర్టుకు తరలించారు.

'పది'లో ప్రథమస్థానంలో నిలబెట్టాలి

● ప్రభుత్వ స్కూళ్ల హెడ్‌మాస్టర్లు, ప్రిన్సిపాల్స్‌తో మాజీమంత్రి హరీశ్‌రావు టెలీకాన్ఫరెన్స్



సిద్దిపేట క్రైం, జనవరి 16: సిద్దిపేట నియోజకవర్గంలో పది ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచేలా కలిసికట్టుగా పని చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గం విద్యాధికారులు, ప్రభుత్వ పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూళ్లు, కస్తూర్బా, రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రిన్సిపాల్స్‌తో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ పది ఫలితాల్లో గత స్ఫూర్తిని కొనసాగించాలని, సిద్దిపేట నియోజకవర్గం 10వ తరగతి ఫలితాల్లో 100 శాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లలు ఎక్కువగా ఉంటారు కాబట్టి వారిలో మనం ఆత్మవిశ్వాసం నింపాలన్నారు. ఇప్పటినుండే ఫలితాల పై ప్రణాళిక తయారు చేసుకోవాలని ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. తల్లి తండ్రులతో మీటింగ్ ఏర్పాటు చేసి పిల్లల చదువుకు సంబంధించి సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించండి, వారికి సాయంత్రం స్నాక్స్ ఏర్పాటు చేసేందుకు నా పూర్తి సహకారం అందిస్తా అన్నారు. 10 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడి చొప్పున కేర్ టీచర్ ఏర్పాటు చేయాలని చెప్పారు.సదరు టీచర్లతో నేను 15 రోజులకు ఒకసారి మాట్లాడుతానన్నారు. పిల్లల తల్లి తండ్రులకు ఉత్తరం కూడా పంపిస్తా, తల్లిదండ్రులతో కాన్ఫరెన్స్ నిర్వహిస్తా, ఇలా అన్ని ప్రణాళికతో గత స్ఫూర్తితో ముందుకెళ్దామని చెప్పారు. అనంతరం పిల్లల చదువులకు సంబంధించిన ప్రణాళికలు, నియోజకవర్గంలోని స్కూళ్ల సంఖ్య, ప్రత్యేక తరగతుల నిర్వహణ తదితర అంశాలపై హెడ్‌మాస్టర్లతో మాట్లాడి వివరాలపై ఆరా తీశారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యా శాఖ నోడల్ అధికారి రామస్వామి, ఎంఈవోలు శ్రీనివాస్ రెడ్డి, యాదవరెడ్డి, దేశిరెడ్డి ఉన్నారు.

దూళిమిట్టలో ముగిసిన జిల్లాస్థాయి క్రీడాపోటీలు



కబడ్డీలో ప్రథమ స్థానంలో నిలిచిన దూళిమిట్ట స్పోర్ట్స్ క్లబ్ టీంకు షీల్డుతో పాటు నగదును అందజేసిన జడ్పీటీసీ, సర్పంచ్

మద్దూరు, జనవరి 16: దూళిమిట్ట మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా దూళిమిట్ట స్పోర్ట్స్‌క్లబ్ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ, బాలీబాల్ క్రీడోత్సవాలు సోమవారంతో ముగిశాయి. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని వరంగల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌మల్లేశం ఈ సందర్భంగా తెలిపారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం దూళిమిట్ట స్పోర్ట్స్ క్లబ్, ద్వితీయ హుస్నాబాద్ క్లబ్ సాధించాయి. తృతీయ,చతుర్థ స్థానాల్లో చేర్యాల, కట్కూర్ గ్రామాలు నిలిచాయి. వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం కొమురవెల్లి మల్లన్న టీం, ద్వితీయ స్థానం సిద్దిపేట క్లబ్ సాధించగాచ తృతీయ, చతుర్థ స్థానాల్లో దూళిమిట్ట స్పోర్ట్స్ క్లబ్, గజ్వేల్ జట్లు నిలిచాయి. విజేతలకు స్థానిక సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డితో కలిసి నగదుతో పాటు షీల్డులు అందించారు. గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రథమ రక్షిత, శివాని, ద్వితీయ కొండూరి స్నేహ, ఎం. కవిత, తృతీయ వి. వాసవి, వసుమతి బహుమతులను గెలుచుకున్నారు. అనంతరం జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. పండగ సందర్భంగా క్రీడాపోటీలను నిర్వహించడం ద్వారా కొత్త వాతావరణంతో నూతనోత్సహం ఏర్పడిందన్నారు. ఈ పోటీలకు ఆర్థిక సహకారం అందించిన స్పాన్సరర్స్ జడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి, సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ పోతరాజు లింగం, జాలపల్లి ఎంపీటీసీ చెట్కూరి కల్యాణికమలాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ నారోజు శ్రీనివాస్, లింగాపూర్ ఉపసర్పంచ్ జెల్ల స్వరూపాశ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ పద్మావెంకట్, మాజీ ఎంపీటీసీ తాడెం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రచ్చ లక్ష్మయ్య, గునుకుల జగన్‌మోహన్‌రెడ్డి, బడుగు అరుణాకర్, సిద్దిపేట బ్యాడ్మింటన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు నాచగోని రాజలింగం, కొంగ సాంబమూర్తి, రావుల అజయ్, ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు భాస్కర్ బందెల కిషన్ రెడ్డికి దూళిమిట్ట స్పోర్ట్స్‌క్లబ్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

కూడవెల్లికి నీళ్లు వదలండి

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన దుబ్బాక ఎమ్మెల్యే



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 16: కూడవెల్లి వాగుకు మల్లన్నసాగర్ ద్వారా నీటిని విడుదల చేయాలని, మెదక్, రామాయంపేట ద్వారా కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. రెండేళ్లుగా మల్లన్నసాగర్ ద్వారా కూడవెల్లి వాగుకు నీటిని అందించేవారు. ఈసారి ప్రభుత్వం మార్పిడి వల్ల కూడవెల్లి వాగుకు విడుదల చేయాల్సిన నీటిని ఇంకా విడుదల చేయలేదు. దీంతో యాసంగి పంటకు రైతులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో ఎమ్మెల్యే మంగళవారం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. అంతేగాక దుబ్బాక నియోజక వర్గంలో సుమారు రూ.1లక్షా 30 వేల ఎకరాలకు నీరందించే బృహత్తర ప్రణాళిక ఇంకా పూర్తికాలేదు. దుబ్బాక నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న సాగునీటికాలువలు, ఉపకాలువలను పూర్తి చేయాలని కోరారు. అలాగే నియోజక వర్గంలో కొన్ని చోట్ల భూసేకరణ సమస్యతో ఆగిపోయిన కాలువలను కూడా పూర్తి చేయాలని కోరారు. మెదక్, రామాయంపేట నుంచి దుబ్బాక నియోజకవర్గంలోకి వచ్చే కాలువలను కూడా పూర్తి చేసి, నీటిని విడుదల చేయాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే విన్నపానికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

అలరించిన ముగ్గుల పోటీలు



హుస్నాబాద్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

హుస్నాబాద్‌రూరల్, జనవరి 16: హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం మిత్రమండలి ఎస్సెస్సీ 87 బ్యాచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు చూపరులను అలరించాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ.. మహిళల్లోని కళానైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని మిత్రమండలి కృషిని కొనియాడారు. కాగా మార్కెట్ యార్డు ఆవరణ మహిళలు, యువతులు వేసిన రంగవల్లులతో సరికొత్త రూపు సంతరించుకున్నది. పోటీలో విజేతలకు మిత్రమండలి 87 నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిత్తారి పద్మ, పలువురు కౌన్సిలర్లు 87 మిత్రమండలి అధ్యక్షుడు బూట్ల రాజమల్లయ్య, ముగ్గుల పోటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

మద్దూరులో ..



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో సర్పంచ్, కమిటీ సభ్యులు

మద్దూరు, జనవరి 16 : మద్దూరు మండల కేంద్రంలో సంక్రాంతి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని వినాయకకమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలు గ్రామస్థులను అలరించాయి. అల్ల కల్పన, సురా హన్సిక, గర్నెపల్లి సౌమ్య, విజేతలుగా నిలిచారు. వారికి గ్రామ సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మద్దూరు టౌన్ అధ్యక్షుడు దామెర మల్లేశం, మాజీ ఎంపీటీసీ బూర్గు నర్సింహులు, రాచకొండ సాయన్న, పారిశ్రామికవేత్త జగదీశ్వర్‌గుప్తా, బూర్గు రాజు, బాలేష్, సిద్ధిరాములు, రాజేశం, వినాయక కమిటీ కన్వీనర్ సతీష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల విజేత తిగుల్



వాలీబాల్ క్రీడాకారులతో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్, జనవరి 16: సంక్రాంతిపండుగ సందర్భంగా సోమవారం స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీఏసీఎస్ డైరెక్టర్ సహకారంతో మండలంలోని తిగుల్ గ్రామంలో జగదేవ్‌పూర్, మర్కూక్ వాలీబాల్ క్రీడాపోటీలను ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. క్రీడల్లో తిగుల్‌జట్టు ప్రథమస్థానం, మర్కూక్ జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. విజేత జట్లకు ఎస్‌ఐ చంద్రమోహన్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, నాయకులు దయానంద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎల్లయ్య, ఐలయ్య, కరుణకర్‌రెడ్డి, మహేష్, రాజు, అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కొవిడ్ 19పై ఏఎన్‌ఎం, ఆశాలకు అవగాహన

మద్దూరు, జనవరి 16 : మద్దూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం కొవిడ్ 19పై ఏఎన్‌ఎం, ఆశాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లద్నూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎంఎల్‌హెచ్‌పీ రాణి మాట్లాడారు. కొత్త సంవత్సరం నుంచి కొవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ముందస్తుగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైరస్ నివారణకు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక దూరాన్ని పాటించే విధంగా చూడాలన్నారు. ముఖాలకు మాస్కులు ధరించాలని సూచించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ హేమలత, స్టాఫ్‌నర్స్ మాధవి, ఏఎన్‌ఎంలు శాంత, నిర్మల, రత్న, స్వరూపతో పాటు ఆశాలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప తిరువాభరణ శోభాయాత్ర



హుస్నాబాద్‌లో అయ్యప్ప తిరువాభరణ శోభాయాత్రలో మాలధారులు

హుస్నాబాద్‌రూరల్, జనవరి 16 : మకర సంక్రాంతి పర్వదినాన అయ్యప్ప మకర జ్యోతి సందర్భాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో అయ్యప్ప తిరువాభరణ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. హుస్నాబాద్ పట్టణంలోని మరకత లింగేశ్వరస్వామి ఆలయంలోప్రత్యేక పూజలు నిర్వహించిన అయ్యప్పస్వామి భక్తులు తిరువాభరణములను పూజించారు. అనంతరం పట్టణంలో శోభాయాత్రతో నగర సంకీర్తన చేసి స్వామివారికి కర్పూరహారతులు సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల వెంకన్న, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, రమాదేవి, భాగ్యారెడ్డి, శంకర్‌రెడ్డి, ఎండీ అయాబ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ఫల, పంచామృతాభిషేకాలు



అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న మాలధారులు

గజ్వేల్ రూరల్, జనవరి 16: గజ్వేల్ పట్టణంలోని శ్రీ హరిహర అయ్యప్ప ఆలయంలో నిర్వాహకులు సోమవారం ప్రధాన అర్చకుడు నందబాలశర్మ ఆధ్వర్యంలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని శబరిమల అయ్యప్ప ఆలయంలో జరిగే మాదిరి విశేష పూజలు నిర్వహించారు. పూర్తి నగలతో స్వామివారిని అలంకరించారు. ఉదయం గణపతి హోమం, సుప్రభాతం, పండ్ల రసాలతో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మాలధారణ స్వాములు, భక్తులు అయ్యప్ప నామ స్మరణతో నృత్యాలు చేస్తూ ప్రత్యేక వాయిద్యాలతో పల్లకి సేవ నిర్వహించారు మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులు ఇచ్చారు. అనంతరం స్వామివారికి 18 మెట్ల పూజ చేశారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ రాజమౌళి, ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, తలకొక్కుల భాగ్యలక్ష్మీదుర్గాప్రసాద్, కోఆప్షన్ గగ్గిశెట్టి రాజు, గురుస్వాములు సురేష్, దుర్గం, మరియాల శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల పెద్దచెరువుపై కొత్తనాటకం తగదు

● సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల, జనవరి 16: చేర్యాల పెద్దచెరువు సుందరీకరణపేరిట మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కొత్త నాటకమాడుతుండటం తగదని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి విమర్శించారు. మంగళవారం పట్టణంలోని పెద్దచెరువును సీపీఎం బృందం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పెద్దచెరువు సుందరీకరణకు మంజూరైన రూ.2.95కోట్లతో పాటు మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కబ్జాచేసిన మత్తడి ఆవరణ స్థలాన్ని కాజేయాలని ప్రస్తుతం ఆయనతో కలిసి కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. గతంలో చేర్యాల ఎమ్మెల్యేగా వ్యవహరించిన సమయంలో చెరువు అభివృద్ధికి పాటుపడతానన్న కొమ్మూరి ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి చెరువు పరిశీలనకు చేర్యాల తహసీల్దారు రాజేశ్వర్‌రావు ఎలా వెళతారని ప్రశ్నించారు. కొమురవెల్లి మల్లన్న చెరువు పనులు సక్రమంగా పూర్తిచేయని కొమ్మూరి చేర్యాల పెద్దచెరువు విషయంలో ప్రదర్శిస్తున్న కపటప్రేమను బయటపెడతామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన తహసీల్దారుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో, దాసరి ప్రశాంత్, పోలోజు శ్రీహరి పాల్గొన్నారు.

సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధ్యమే



మాట్లాడుతున్న స్వామి యజ్ఞానంద

జగదేవ్‌పూర్, జనవరి 16: సంకల్ప బలం ఉంటే ఏదైనా సాధించవచ్చని చిన్మయ మిషన్‌స్వామి యజ్ఞానంద పేర్కొన్నారు. మంగళవారం మర్కూక్ మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో నిర్వహించిన ఓ యువతమేలుకో అనే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ సెంట్రల్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ విద్యార్థులు యువత సంకల్ప బలం పెంచుకుంటే జీవితంలో ఏ స్థాయికి అయినా చేరుకోవచ్చన్నారు. రామాయణ, మహాభారత ఇతిహసలను నిత్య జీవితంలో అన్వయించుకుని ప్రస్తుత జీవితంలో వాటిని శాస్త్రీయ పద్ధతిలో అనుసరించాలన్నారు. సరైన విద్యను అభ్యసించి భావితరాలకు అందించాన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ పండరీ, అసిస్టెంట్ గవర్నర్ హరిశంకర్, వివిరమణ, గ్రామ సర్పంచ్ భాగ్యభిక్షపతి, ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాల్‌రాజు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలు



చేర్యాల మండలం కడవేరుగు జడ్పీఎస్ఎస్‌లో పదోతరగతి 2007-08 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాల ఆవరణలో సమావేశమై సందడి చేశారు. ఆత్మీయ సమ్మేళనాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. తమ పాతజ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ఆటపాటలతో రోజంతా సందడిగా గడిపారు.
- చేర్యాల, జనవరి 16



నంగునూరు ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ 2003-04 బ్యాచ్ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆత్మీయంగా పలకరించుకుని పరస్పర యోగక్షేమాలను తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు, ప్రస్తుత మండల విద్యాధికారి తగిరెడ్డి దేశీరెడ్డి, మెదక్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్, తొంట కనకయ్య, పబ్బతి శ్రీనాకర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు దాసరి పెంటయ్య, బొజ్జ చంద్రకాంత్, రాధాకృష్ణ, అనరాజు నాగరాజు, రాగుల కనకయ్య, రాజ్‌కుమార్, మోహన్‌బాబు, స్వాతి, సుమలత, రమ్య, రమాదేవి పాల్గొన్నారు.
- నంగునూరు, జనవరి 16